క్లుప్తంగా

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ



చిలకలూరిపేట: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే రక్తహీనతను నివారించవచ్చని డాక్టర్ కందిమళ్ల జయమ్మ చెప్పారు. ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని కేజే ఆసుపత్రిలో ఉచిత రక్తహీనత పరీక్షల శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయమ్మ మాట్లాడుతూ ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటు పడి పౌష్టిక విలువలు కలిగిన ఆహారం తీసుకోకపోవడం రక్తహీనతకు దారి తీస్తున్నదని వెల్లడించారు. రక్తహీనత కారణంగా అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా 50 మందికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన చర్యలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కరణం విజయలక్ష్మి, షేక్ ఆదిల్, నాగరాజు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన డీఈవో

వినుకొండ: పట్టణంలోని పలు పదవ తరగతి పరీక్ష కేంద్రాలను డీఈవో చంద్రకళ సోమవారం పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఫస్ట్ వార్డు స్కూల్, లయోల స్కూల్స్‌లో జరుగుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని డీఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 126 సెంటర్లకు గాను 26,497 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని, వీరిలో 1100 మంది ఓపెన్ టెన్త్ పరీక్షలు రాస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడ అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోలేదని ప్రశాంతంగానే పరీక్షలు జరుగుతున్నాయన్నారు. రూరల్ పరిధిలో పరీక్ష కేంద్రాలకు ఫ్లయింగ్ స్క్వాడ్‌తో పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. తొలుత పరీక్ష కేంద్రాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు.

వర్సిటీ బేస్‌బాల్ జట్టుకు వినుకొండ విద్యార్థి



వినుకొండ: స్థానిక గంగినేని కల్యాణి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి బోధనం శ్రీను అంతర విశ్వవిద్యాలయ ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బేస్ బాల్ పోటీలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తరుపున యూనివర్సిటీ స్థాయి జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 20, 21 తేదీలలో చోడవరంలోని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన అంతర్ కళాశాలల బేస్ బాల్ పోటీలలో పాల్గొని తన ప్రతిభ చూపించి యూనివర్సిటీ స్థాయి జట్టుకు ఎంపిక అవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ మేరకు బోధనం శ్రీనుని కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్చార్జి ఎం.జగదీష్, ఫిజికల్ డైరెక్టర్ జి. వెంకటచారి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం అభినందనలు తెలియజేశారు. ఎంపికైన విద్యార్థి పంజాబ్ యూనివర్సిటీ చండీఘర్‌లో జరుగనున్న అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ తెలిపారు.

నెలాఖారులోగా దరఖాస్తు చేసుకోండి

శావల్యాపురం: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా నూతన గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని మండల హౌసింగ్ ఏఈ షేక్ నసిరుద్దీన్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఈ మాట్లాడుతూ నివేశిత ధ్రువీకరణ పత్రం, భార్యభర్తలు ఇరువురు ఆధార్, బ్యాంకు ఖాతా, తదితరవన్నీ సచివాలయాల్లోని ఇంజినీరింగ్ సహాయకులకు అందజేసి ఆన్‌లైన్ నమోదు చేయించాలన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఇప్పటి వరకు 740 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈనెలాఖారులోగా తుది గడువన్నారు.

దాడి కేసులో 10 మందికి జైలు, జరిమానా

నరసరావుపేటటౌన్: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించటంతో పాటు దాడి చేసినట్లు నేరం రుజువు అవడంతో 10 మంది నిందితులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆర్. ఆశీర్వాదం పాల్ సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. 2018 జులై 27వ తేదీన మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో తమ ఇంటి ముందు మూత్ర విసర్జన చేయవద్దు అని ఫిర్యాది బత్తుల కోటేశ్వరమ్మ అడిగినందుకు నిందితులు ఫిర్యాదుదారుని పట్ల అసభ్యంగా ప్రవర్తించి దాడి చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న నరసరావుపేట రూరల్ పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితులను అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు అవడంతో 10 మంది నిందితుల్లో ఇద్దరికి నల్లగంగుల వెంకటరత్నం, నల్లగంగులు రామిరెడ్డి లకు ఒక్కొక్కరికీ మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.10,000 జరిమానా అదేవిధంగా మిగిలిన 8 మంది నిందితులు నల్లగంగుల నాగేశ్వర్ రెడ్డి, నల్లగంగుల రామాంజనేయ రెడ్డి, నల్లగంగుల అనురాధ, నల్లగంగుల ధనలక్ష్మి, నల్లగంగుల కవిత, నల్లగంగుల సరోజిని, నల్లగంగుల ఆదినారాయణ రెడ్డి, నల్లగంగుల అంజిరెడ్డిలకు ఒక్కొక్కరికీ ఏడాది జైలు శిక్ష రూ. 1000 రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది.

ఈ-కేవైసీ చేయలేదా..! అయితే రేషన్ కట్!!

- ఈనెల 31తో పూర్తికానున్న గడువు
- 4,454 మంది ఇంకా పెండింగ్



యడ్లపాడులో ఈ-కేవైసీ చేస్తున్న దృశ్యం

యడ్లపాడు: మండలంలో రైస్‌కార్డుదారుల కోసం ఈ-కేవైసీ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. రైస్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబ సభ్యుడిని ఒక్కో యూనిట్‌గా పరిగణించి ఈ-కేవైసీ ప్రక్రియ జరుగుతోంది. 5 ఏళ్ల లోపు చిన్నారులకు ఈ-కేవైసీ అవసరం లేదని, మిగిలిన వారు డీలర్లు, వీఆర్వో, ఎండీయూ ఆపరేటర్ల వద్ద తక్షణమే ఈ-కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ జెట్టి విజయశ్రీ తెలిపారు.

మండలంలో...

మండల పరిధిలో మొత్తం 17,279 రైస్‌కార్డులు ఉండగా, వీటిలో 49,157 మంది కుటుంబ సభ్యులు లబ్ధిదారులుగా ఉన్నారు. ఇప్పటి వరకు 43,853 మంది ఈ-కేవైసీ పూర్తి చేసుకున్నారు. అయితే 5,304 మంది ఇంకా ఈ ప్రక్రియను పూర్తి చేయలేదు. ఇప్పటికే ఈనెల 14వ తేదీ నుంచి 850 మంది ఈ-కేవైసీ చేయించుకున్నారు. కానీ ఇంకా 4,454 మంది పెండింగ్‌లో ఉన్నారు. అధికారులు స్పష్టం చేశారు. ఈనెల 31వ తేదీ చివరి గడువు కాగా ఈ లోపు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని కోరారు.

సుదూర ప్రాంతాలకు సడలింపు!

ఉపాధి, విద్య, ఉద్యోగం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు తమ ప్రస్తుత నివాస ప్రాంతంలోని డీలర్ లేదా వీఆర్వో ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకునే సౌలభ్యం ఉందన్నారు. అయితే ఇతర రాష్ట్రాల్లో ఉన్నవారు మాత్రం స్వగ్రామానికి వచ్చి చేయించుకోవాల్సి ఉంటుందని వెల్లడించారు. ఈ మేరకు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో ఈ-కేవైసీ త్వరితగతిన పూర్తి చేసేందుకు సమావేశం ఏర్పాటు చేసి, తగు సూచన్లు చేశారు.

31 వరకే గడువు



ఈ-కేవైసీ చేయించుకోని వారి పేర్లు కార్డుల నుంచి తొలగించటంతో పాటు వారికి నిత్యావసర సరుకుల పంపిణీ నిలిపివేసే అవకాశం ఉంటుంది. కావున పెండింగ్‌లో ఉన్న వారంతా 31వ తేదీ లోగా తమ డీలర్, ఎండీయూ, వీఆర్వోల వద్ద ఈ-కేవైసీ చేయించుకోవాలి.

–జెట్టి విజయశ్రీ, తహసీల్దార్ యడ్లపాడు

జేఎన్‌టీయూఏన్ భవన నిర్మాణాలు అద్భుతం

- వైఎస్సార్ సీపీ హయాంలో భవన నిర్మాణాలు
- పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ
- సౌకర్యాలు చక్కగా ఏర్పాటు చేశారని కితాబు



జేఎన్‌టీయూఏన్ కళాశాల భవనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట రూరల్: కాకానిలోని జేఎన్‌టీయూఏన్ ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణాలు అద్భుతంగా ఉన్నాయంటూ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు కితాబిచ్చారు. జేఎన్‌టీయూఏన్ కళాశాలను సోమవారం ఆయన సందర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు పూర్తయిన భవనాలతో పాటు నిర్మాణ దశలో ఉన్న భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ జేఎన్‌టీయూఏన్ కళాశాల ప్రగతిపై అసెంబ్లీలో ప్రస్తావించినట్టు తెలిపారు. కళాశాలలో అవుట్‌సోర్సింగ్ ఫ్యాకల్టీ ఎక్కువ మంది ఉన్నారని, పర్మినెంట్ ఫ్యాకల్టీని నియమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ నియమకాలు జరగాల్సి ఉందన్నారు. యువతీ, యువకుల వసతి గృహాల నిర్మాణాలు తుదిదశలో ఉన్నాయని తెలిపారు. ఇక్కడ నిర్మాణాలు పరిశీలిస్తే చక్కగా ఏర్పాటు చేశారన్నారు. కళాశాలలో చదివే విద్యార్థులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు ఉన్నాయని తెలిపారు. కళాశాలకు మరిన్ని సౌకర్యాలు కల్పించి నాణ్యమైన సాంకేతిక విద్య విద్యార్థులకు అందేవిధంగా కృషిచేస్తానని తెలిపారు. కళాశాల ప్రాంగణాన్ని యూనివర్సిటీగా మార్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలకు కేంద్రంగా ఇది ఉందన్నారు. జేఎన్‌టీయూ కాకినాడ తరహాలోనే ఇది కూడా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు త్వరలోనే కళాశాలను సందర్శిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు, కొల్లి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

నిలిచిపోయిన భవన నిర్మాణ పనులు



పిచ్చిమొక్కలతో కనిపిస్తున్న స్థలం

నూజెండ్ల: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. గతంలో ఎన్నెస్పీ కార్యాలయం ప్రాంగణంలో ఉండగా, శిథిలావస్థకు చేరటంతో దాని స్థానంలో 2019లో రూ. 90 లక్షల అంచనాలతో నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే పునాది వరకు పూర్తి అయింది. ప్రస్తుతం స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఆవరణలోని పాత భవనంలో రెవెన్యూ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. మండల పరిషత్ గ్రామ సచివాలయం రైతుసేవా కేంద్రం ఒకే చోట ఉండి రెవెన్యూ కార్యాలయం మాత్రం గ్రామానికి దూరంగా ఉండటంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ముళ్ళకంచెలు పిచ్చిచెట్లు మొలిచి చినపాటి అడవిని తలపిస్తోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ప్రభుత్వం స్పందించి నిలిచిపోయిన తహసీల్దారు భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మెరుగైన చికిత్సతో క్షయవ్యాధి నివారణ



చిలకలూరిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలు



శావల్యాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



వినుకొండలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

చిలకలూరిపేట: క్షయ వ్యాధికి సమర్థవంతమైన చికిత్స ఉందని డాక్టర్ ప్రసాద్‌నాయక్, డాక్టర్ నాగలక్ష్మి చెప్పారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని రజక కాలనీ టీబీ యూనిట్ ఆధ్వర్యంలో ప్రజల్లో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ సోమవారం నిర్వహించారు. వైద్యుల సూచన మేరకు క్రమం తప్పకుండా మందులు తీసుకుంటే క్షయవ్యాధిని పూర్తిగా నివారించవచ్చన్నారు. అదే విధంగా రోగులకు పౌష్టికాహారం నిమిత్తం నెలకు కేంద్ర ప్రభుత్వం రూ. వెయ్యి జమచేస్తారని తెలిపారు. క్షయవ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సిబ్బంది లావణ్య, ప్రసాద్‌నాయక్, నాసరయ్య, ఎస్‌కె వలి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ టీబీ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆవరణంలో మానవహారంగా నిల్చొని టీబీపై ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. పీపీ యూనిట్ ఎంటీసీ డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ ప్రజలు క్షయవ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని, రెండు వారాల జ్వరం, కళ్లెలో రక్తం పడుట, బరువు తగ్గుట ఈ లక్షణాలు ఉన్న వారు కళ్లె పరీక్ష, ఎక్సరే ఈ రెండు పరీక్షలు చేయించుకోవాలని, ఈ వ్యాధికి సంబంధించిన మందులు ఖచ్చితంగా వినుకొండ సీహెచ్‌సీలో అందజేస్తామని తెలిపారు. వినుకొండ సీహెచ్‌సీ సూపరింటెండెంట్ అబ్దుల్ రజాక్, డాక్టర్ సుధా స్రవంతి, ఎస్కే సుభాని, ఎస్.రాజేశ్వరరావు, ఎన్ఎస్‌పీ యూపీహెచ్‌సీ, హనుమన్‌నగర్ యూపీహెచ్‌సీ డాక్టర్స్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి రావిపూడి రమ్య అవగాహన సదస్సు, ర్యాలీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, కళ్లె పడటం, జ్వరం రావటం, బరువు తగ్గటం, తదితర లక్షణాలున్న వారందరూ సత్వరమే వైద్యులను సంప్రదించాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా వైద్య పరీక్షలు మందులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజరు అలవలపూడి ఏడుకొండలు, ల్యాబ్ టెక్నీషియన్లు సతీష్, సీతారామిరెడ్డి, ఫార్మాసిస్ట్ లక్ష్మీనారాయణ, స్టాఫ్ నర్సు ప్రమీల, ఆరోగ్య కార్యకర్తలు నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్‌ఈసీలో ఎల్‌వైఎఫ్ చిత్ర బృందం సందడి



విద్యార్థులతో సందడి చేస్తున్న హీరో శ్రీహర్ష

నరసరావుపేట రూరల్: లవ్ యువర్ ఫాదర్(ఎల్‌వైఎఫ్) చిత్ర బృందం నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సందడి చేసింది. శ్రీహర్ష, కషికాకపూర్ హీరో, హీరోయిన్‌లుగా ప్రముఖ గాయకుడు ఎస్పీ చరణ్ ముఖ్యపాత్రలో నటించిన ఈ సినిమా ఏప్రిల్ 4వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. మూవీ ప్రమోషన్‌లో భాగంగా హీరో శ్రీహర్ష, చిత్ర బృందం కళాశాలకు విచ్చేశారు. విద్యార్థులతో సెల్ఫీలు దిగి సందడి చేశారు. ఈ సందర్భంగా హీరో శ్రీహర్ష మాట్లాడుతూ తండ్రీ, కొడుకుల మధ్య ఉండే అనుబంధంపై సినిమా రూపొందించడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరు సినిమా చూసి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సినిమాలో నటించిన బంటి, శ్రీధర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాలపరిమితి మరో ఆర్నెల్లు పొడిగించండి

జాయింట్ కలెక్టర్‌ను కోరిన త్రికోటేశ్వర రైతు సంఘ నాయకులు

నరసరావుపేట: లింగంగుంట్ల గ్రామ రైతుల ఆధీనంలోని పుష్పగిరి పీఠం భూముల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ఎండోమెంట్ కమిటీ కాల పరిమితిని మరో ఆర్నెల్లు పొడిగించాలని త్రికోటేశ్వర రైతు సంఘ నాయకులు వై.రవీంద్రరెడ్డి, జీపీ రెడ్డి, ఏరువ బాలమోహనరెడ్డి కోరారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబుతో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ గనోరే సూరజ్ ధనుంజయకు వినతిపత్రం సమర్పించారు. పుష్పగిరి పీఠంకు, రైతుల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు హైకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి ఎండోమెంట్ కమిషనర్, మరో ముగ్గురితో కలిసి ఒక కమిటీ నియామకం జరిగిందన్నారు. రైతుల వద్దనున్న లింగంగుంట్ల భూముల వివరాలు, వాటి విలువలు 2024 మార్చి 22 నుంచి సెప్టెంబరు 22 లోగా తెలియచేయాలని కమిటీకి ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అప్పుడు ఎన్నికల సమయంలో రెవెన్యూ సిబ్బంది ఉండటం వల్ల కమిటీ నివేదిక పూర్తికాలేదన్నారు. మళ్లీ కమిటీని ఈ ఏడాది మార్చి 22 వరకు పొడిగించటం జరిగిందన్నారు. సర్వే గజిట్ పబ్లికేషన్ జూలై మూడవ తేదీ వరకు ఉండటంతో పాటు అండగల్ పని పూర్తికానందున మరో ఆర్నెల్లు పొడిగించాలని కోరారు. దీంతోపాటు గ్రామ రైతుల పేర్లను 460 మందిగా పంపారని, మిగిలిన రైతుల పేర్లను కూడా ఎండోమెంట్ కమిషనర్‌కు పంపాలని వారు కోరారు.

తుర్లపాడులో పేకాటరాయుళ్ల అరెస్టు

యడ్లపాడు: కొత్తముక్కల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. మండలంలోని తుర్లపాడు గ్రామ పొలాల్లో కోతముక్క ఆట జరుగుతున్నట్లు సమాచారం పోలీసులకు అందింది. దీంతో యడ్లపాడు ఎస్సై వి.బాలకృష్ణ తన సిబ్బందితో కోతముక్కల స్థావరంపై ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడిలో కోతముక్క ఆటలో పాల్గొన్న 11 మందిని పట్టుకుని, వారి వద్ద నుంచి రూ.28,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన



నరసరావుపేట ఈస్ట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి మార్చి 23 నుంచి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14వ తేదీ వరకు చేపట్టిన ప్రచార ఆందోళన కార్యక్రమంలో భాగంగా సోమ వారం సత్తెనపల్లి రోడ్డులో ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ పేద, మధ్య తరగతి ప్రజలపై పెను భారాలు మోపుతున్నారని విమర్శించారు. విద్య, వైద్యం పేదలకు అందుబాటులో లేకుండా చేసారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పలపాటి రంగయ్య, షేక్.చిన జాన్‌సైదా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సేల్స్ ఆఫీసర్ మృతి



నరసరావుపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నవోదయ నగర్ ప్రాంతానికి చెందిన చుండూరి శ్రీనివాసరావు (47) ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై తెల్లవారుజామున వస్తూ చెరుకూరి హాస్పటల్ సమీపంలో ప్రమాదవశాత్తు మలుపు తిరిగే సమయంలో కింద పడ్డాడు. గమనించిన స్థానికులు అతడిని సమీపంలోని ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు పట్టణంలోని ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో సేల్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడికి భార్య లక్ష్మీతో పాటు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

జాతీయ బేస్‌బాల్ పోటీలకు ఎంఏఎం విద్యార్థులు



నరసరావుపేట రూరల్: జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంఏఎం పీజీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల బేస్‌బాల్ పోటీలు ఈనెల 21,22 తేదీలలో ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఈ పోటీలలో కళాశాల జట్టు ప్రతిభ కనబర్చి తృతీయ స్థానం సాధించింది. జట్టులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఎ.సంజయ్, బి.సాగర్‌లు వర్సిటీ జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. వీరు పంజాబ్‌లో నిర్వహించే జాతీయస్థాయి ఇంటర్ వర్సిటీ పోటీల్లో నాగార్జున యూనివర్సిటీ జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ ఎంవీ శేషగిరిరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రామారావు, ఎంసీఏ హెచ్‌వోడీ నవీన్, ఎంబీఏ హెచ్‌వోడీ సితారలు అభినందించారు.

చెత్త నుంచి పంచాయతీలకు అదనపు ఆదాయం



నాదెండ్ల ఘనవ్యర్థాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ రాణి, అధికారులు, సిబ్బంది

నాదెండ్ల: చెత్త నుంచి సంపద సృష్టిస్తే గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి ఐదు రోజుల పాటూ జరిగే ఘనవ్యర్థాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. తొలిరోజు నాదెండ్ల మండల పరిధిలో జరిగిన శిక్షణ కార్యక్రమానికి సర్పంచ్ మొగిలి నాగలక్ష్మి అధ్యక్షత వహించారు. మంగళవారం, బుధవారాల్లో చిలకలూరిపేట, గురు, శుక్రవారం యడ్లపాడు మండల సిబ్బదికి శిక్షణ జరగనుంది. తొలిరోజు శిక్షణకు నాదెండ్ల మండల పంచాయతీ కార్యదర్శులు, గ్రామ గ్రీన్‌గార్డులు, క్లాప్ మిత్రాలు, ఉపాధి హామీ పథకం టీఏలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పూర్తిగా చెత్త సేకరణ లక్ష్యంగా పనిచేయాలన్నారు. గ్రామస్తులు ప్రతిరోజూ సేకరించిన తడి, పొడి చెత్తతో పాటూ ప్రమాదకర చెత్తను వేర్వేరుగా విభజించి చెత్త సేకరించే సిబ్బందికి అందించాలన్నారు. ఇలా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి వానపాముల ఎరువుల తయారీ, రీసైక్లింగ్ చేయాలన్నారు. వానపాముల ఎరువు, రీసైక్లింగ్ ద్వారా సేకరించిన వేస్ట్‌ను విక్రయిస్తే పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. అనంతరం చిలకలూరిపేట నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన నాదెండ్ల ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శిక్షకులుగా పంచాయతీ కార్యదర్శులు మారుతీ బాబు, లక్ష్మీనారాయణ, కె.మధుబాబు, ఈవోపీఆర్డీ లక్ష్మీకుమారి వ్యవహరించారు.

సమష్టిగా తిరునాళ్లు విజయవంతం చేద్దాం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

శావల్యాపురం: ఉగాది పర్వదినం రోజున ఈనెల 30న మండలంలోని బొందిలిపాలెంలో వేంచేసియున్న శ్రీఅడవి పేరంటాళ్ళ అమ్మవారి తిరునాళ్ల వేడుకలు సందర్భంగా ప్రజాప్రతినిధులు, అన్నీ శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతం చేయాలని తహసీల్దారు కె.సుజాత కోరారు. సోమవారం అడవి పేరంటాళ్ళమ్మ అమ్మవారి దేవాలయాన్ని సందర్శించి, తిరునాళ్ళ ఏర్పాట్లుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రసిద్ధి చెందిన తిరునాళ్లకు వేల సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుంటారన్నారు. పంచాయతీ తరుపున శానిటేషన్ పనులు చేయించటంతో పాటు రెండు మంచినీటి ట్యాంకులు ఉదయం నుంచి దేవాలయం ప్రాంగణంలో ఉంచాలన్నారు. తిరునాళ్ల వేడుకల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వేసవి కాలం కావటం చేత ఓఆర్ఎస్ ద్రావణం ప్యాకెట్లు ఆరోగ్య కార్యకర్తలు పర్యవేక్షణ చేయాలన్నారు. క్యూలైన్లోని భక్తులు ఇబ్బందులు పడకుండా దేవదాయశాఖాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనల మేరకు మూడు పార్కింగ్ స్థలాలు కేటాయించామని, తిరునాళ్ల నేపథ్యంలో మహిళ భక్తులు బంగారు ఆభరణాలు పట్ల పలు రకాల జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యుత్ ప్రభలు నిర్వాహకుల ముందుస్తుగా పోలీసు అనుమతులు పొందాలన్నారు. ఈ సదస్సులో పంచాయతీ కార్యదర్శి బాల పరమేశ్వరరావు, మాజీ సర్పంచ్ బత్తుల వెంకటేశ్వర్లు, దేవదాయశాఖాధికారి యం.సుధాకర్‌రెడ్డి, ఏఈ జవ్వాజీ నటరాజ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

యడ్లపాడు బైపాస్‌లో యువకుడు దుర్మరణం

మృతుడు కనిగిరి మండలం కూచిపూడిపల్లి వాసి



యడ్లపాడు: రోడ్డు దాటుతున్న ఫోర్‌వీల్ ఆటోడ్రైవర్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలో హైవే బైపాస్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా కనిగిరి మండలం కూచిపూడిపల్లి గ్రామానికి చెందిన బత్తుల యాగయ్య ఫోర్‌వీల్ టాటాఇంట్రా వాహనంలో గుంటూరు నుంచి కనిగిరికి ఇంటి సామాన్ల లోడుతో ఆదివారం రాత్రి బయలుదేరాడు. మండలంలోని తిమ్మాపురం హైవే బైపాస్ ఎక్కగానే ఫోర్‌వీల్ వాహనం అదుపుతప్పి ముందు వెళ్తున్న కారును వెనుక నుంచి ఢీకొంది. దీంతో కారు యజమానితో డ్రైవర్ యాగయ్య మాట్లాడి తిరిగి తన వాహనం వద్దకు వస్తున్న క్రమంలో.. అదే సమయంలో అటువైపు దూసుకువచ్చిన గుర్తు తెలియని వాహనం యాగయ్యను ఢీకొంది. దీంతో తలకు తీవ్ర గాయాలైన యాగయ్య (23) సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న మృతుని తల్లిదండ్రులు ఏడుకొండలు, వరమ్మ, బంధువులతో యడ్లపాడుకు చేరుకున్నారు. తల్లి వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం



బొల్లాపల్లి: మండలంలోని రేమిడిచర్ల పంచాయతీ పరిధిలో తాగునీటి ఇబ్బందులు పడుతున్న 16 గ్రామాలకు నీటి సరఫరా చేసేందుకు వాటర్ ట్యాంకులను స్థానిక ఎమ్మెల్యే, చీఫ్‌విప్ జీ.వి.ఆంజనేయులు సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ బొల్లాపల్లి మండలంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ట్యాంకుల ద్వారా నీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ పీసీడీ అధ్యక్ష, కార్యదర్శులుగా తాళ్ల, చేగు



నరసరావుపేట ఈస్ట్: నరసరావుపేట ప్రాపగాండ కమ్ డిస్ట్రిబ్యూటర్స్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తాళ్ల వెంకట కోటిరెడ్డి, కార్యదర్శిగా చేగు వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నూతన కార్యవర్గ ఎన్నికల్లో అధ్యక్ష, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అసోసియేషన్ అభివృద్ధికి, సభ్యుల సమస్యలను పరిష్కరించటంలో తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.

నిబంధనలు అతిక్రమించొద్దు



వైన్స్ షాపులో తనిఖీలు చేస్తున్న సీఐ సోమయ్య

నరసరావుపేటటౌన్: మద్యం దుకాణ నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ సోమయ్య హెచ్చరించారు. వైన్స్‌ల్లో అనధికార పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేయటంపై ఇటీవల బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సీఐ సిబ్బందితో పలు వైన్స్‌లను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్‌లను, నౌకర్ నామాను పరిశీలించారు. వైన్స్ నిర్వాహకులు నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. సమయపాలన పాటించాలన్నారు. వైన్స్‌ల్లో సిట్టింగ్ ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.